సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి



ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగం (ఎస్టీఎం) వివిధ ఉత్పత్తుల తయారీలో పలు రికార్డులను అధిగమిస్తోంది. గతంలో యాంగిల్, 50 ఎం.ఎం.రౌండ్, 63 ఎం.ఎం రౌండ్ ఉత్పత్తుల్లో రికార్డులు సాధించగా.. ఈనెల 16న రాత్రి షిఫ్టులో 85 ఎం.ఎం రౌండ్ ఉత్పత్తిలో రికార్డు సాధించింది. విభాగంలో తయారయ్యే పలు ఉత్పత్తుల్లో ఒకటైన 85 ఎం.ఎం రౌండ్ ఆ రోజు అత్యధికంగా 751 టన్నులు ఉత్పత్తి సాధించింది. రికార్డు ఉత్పత్తి సాధించిన ఎస్టీఎం విభాగం ఉద్యోగులను విభాగం ఉన్నతాధికారులు అభినందించారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా అశోక్ కుమార్



కేజిహెచ్ సూపరింటెం డెంట్ అశోక్ కుమార్

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పి.అశోక్‌కుమార్ తిరిగి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ శివానంద్ ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా కొనసాగుతారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన సూపరింటెండెంట్‌గా అశోక్ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. మే 21న విధి నిర్వహణలో ఆయనకు గుండెనొప్పి రావడంతో మే 22 నుంచి సెలవు పెట్టారు. ఆ తర్వాత ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. జూన్ 22న కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ పి.శివానంద్ సూపరింటెండెంట్ (ఎఫ్‌ఏసీ)గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగా.. పరిపాలన విభాగం, నర్సింగ్, పారా మెడికల్, సహాయక సిబ్బంది డాక్టర్ అశోక్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

20న సివిల్స్ ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

కొమ్మాది: సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 20న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు జె.రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని బి.వి.కె. కాలేజీ, ప్రిజమ్ డిగ్రీ కాలేజ్, లంకపల్లి బుల్లయ్య కళాశాలలు, గాయత్రి విద్యా పరిషత్, సాంకేతిక విద్యా పరిషత్‌లోని ఏడు కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు https://apstdc.apcfss.in/ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 0891–2551001ను సంప్రదించాలన్నారు.

క్రీడా ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: క్రీడా ప్రతిభా అవార్డుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి చిల్ల వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు అందజేస్తామన్నారు. క్రీడా పోటీల్లో ఆయా పాఠశాలలు సాధించిన విజయాల వివరాలతో ఈ నెల 19లోగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 88664 01002లో సంప్రదించవచ్చు.

రెండు శాఖలుగా ఏయూ యోగా విభాగం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం రెండు శాఖలుగా విభజన కానుంది. యోగా విభాగం పూర్తిస్థాయిలో కోర్సుల బోధన, పరిశోధన సంబంధిత అంశాల్లో పనిచేస్తుంది. ఆర్ట్స్ కామర్స్ కళాశాల పరిధిలో ఈ శాఖ ఉంటుంది. బీచ్‌రోడ్డులోని సువిశాల ప్రాంగణంలోని యోగా విలేజ్‌లో ప్రస్తుతం అందించే సేవలను మరింత విస్తృతం చేయనున్నారు. నగర ప్రజలకు యోగాను మరింత చేరువ చేయడంతో పాటు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. దేశంలోనే ప్రముఖ యోగా కేంద్రాల్లో ఒకటిగా దీనిని అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

టూరిజం ఆన్ వీల్స్



హిల్ స్టేషన్ కారవాన్ రానున్న డల్లాపల్లి ప్రాంతం

- రాష్ట్ర వ్యాప్తంగా 15 ప్రాంతాల్లో కారవాన్ టూరిజంకు ప్రణాళికలు
- ఒక్కో ప్రాంతంలో అర ఎకరా విస్తీర్ణంలో పాత్ అభివృద్ధి
- పిక్నిక్ సీజన్‌లో ప్రారంభించేందుకు పర్యాటక శాఖ సన్నాహాలు

విహారయాత్రకు వెళ్లేటప్పుడు హోటల్‌లో రూమ్ కోసం ఎదురు చూడటం.. రెస్టారెంట్‌లో ఫుడ్ హోమ్లీగా ఉంటుందో లేదో అనే సందేహంతో అడుగు వేయడం.. ప్రైవసీపై ఎన్నో అనుమానాలు.. ప్రతి పర్యాటకుడికీ ఇలాంటి అనుభవాలు ఎదురయ్యే ఉంటాయి. ఇప్పుడా ఆ సమస్య లేకుండా.. నచ్చిన చోటకు వెళ్లి.. మనకు నచ్చినట్లుగా ఉండొచ్చు. అదే కారవాన్ టూరిజం. కొత్తపుంతలు తొక్కుతున్న ఈ టూరిజం వైపు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 ప్రాంతాల్లో దీనిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రాంతాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. మూడు రకాల కారవాన్ టూరిజంను పర్యాటకులకు పరిచయం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

–సాక్షి, విశాఖపట్నం

ఇప్పటికే ప్రపంచ దేశాల్లో, మన దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కారవాన్ పర్యాటకం ఉమ్మడి విశాఖ జిల్లాలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, గండికోట తదితర 15 చోట్ల దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందులో విశాఖకు సంబంధించి 3 ప్రాంతాలను ఎంపిక చేశారు.

ఉమ్మడి విశాఖలో గుర్తించిన ప్రాంతాలివే..

- అల్లూరి జిల్లాలోని అంజోడా –ఫారెస్ట్ కారవాన్
- డల్లాపల్లి – హిల్‌స్టేషన్ కారవాన్
- ఎర్రమట్టి దిబ్బలు – బీచ్ కారవాన్



ఇవీ సౌకర్యాలు

కారవాన్‌లో లగ్జరీ హోమ్స్ మాదిరిగా లాంజ్ కమ్ బెడ్రూమ్, కిచెన్, రెస్ట్ రూమ్ ఉంటాయి. క్వీన్ లేదా కింగ్ సైజ్ బెడ్, మైక్రోవేవ్, ఎలక్ట్రిక్ కెటిల్, టోస్టర్, ఇండక్షన్ స్టవ్, మినీ ఫ్రిడ్జ్, షవర్‌తో కూడిన అత్యాధునిక టాయిలెట్ తదితర సౌకర్యాలన్నీ ఉంటాయని పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు స్మార్ట్ టీవీ, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్, సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వివిధ సైజుల్లో కారవాన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ పర్యాటక శాఖ భావిస్తోంది.

కన్సల్టెన్సీ కసరత్తు

కారవాన్ టూరిజంను పైలట్‌గా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన కన్సల్టెన్సీ సంస్థ కసరత్తు చేస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో డిమాండ్ ఎలా ఉంటుందన్న అంశంపై నివేదిక సిద్ధమవుతోంది. మరోవైపు కారవాన్ టూరిజంలో పెట్టుబడులు పెట్టేందుకు కొన్ని సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు టూరిజం శాఖతో ఇప్పటికే సంప్రదింపులు జరిపాయి. పైలట్ ప్రాజెక్టు పద్ధతిలో నిర్వహిస్తున్న తరుణంలో లగ్జరీ కంపెనీల వాహనాలు కాకుండా.. సాధారణ వాహనాలను లగ్జరీగా డిజైన్ చేయనున్నారు. ఇందుకోసం రవాణా శాఖ నుంచి అనుమతులు తీసుకొచ్చేందుకు పర్యాటక శాఖ సమాయత్తమవుతోంది.

మూడు భిన్నమైన కారవాన్‌లు

కారవాన్ టూరిజం సాధ్యాసాధ్యాలపై పర్యాటకశాఖ ఎండీ కన్నబాబు, రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి ఇటీవల అరకు, లంబసింగి, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి నివేదికలు సిద్ధం చేశారు. మూడు ప్రాంతాల్లో మూడు భిన్నమైన టూరిజం స్పాట్లు ఎంపిక చేశారు. పైన్ చెట్లు అధికంగా ఉన్న అనంతగిరికి 35 కి.మీ దూరంలోని అంజోడాలో ఫారెస్ట్ కారవాన్, డల్లాపల్లిలో హిల్‌స్టేషన్ కారవాన్, ఎర్రమట్టి దిబ్బలు ఎదురుగా బీచ్ కారవాన్‌ను పైలట్‌గా ప్రారంభించేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. పైన్ చెట్లు పెంచేందుకు రెవెన్యూ విభాగం.. అటవీ శాఖకు 26 ఎకరాలు ఇచ్చింది. ఇందులో రెండు ఎకరాలను తమకు బదలాయిస్తే కారవాన్ టూరిజం ఏర్పాటు చేస్తామని అటవీశాఖకు లేఖ రాశారు. త్వరలోనే దీనికి సంబంధించిన అనుమతులు వచ్చే అవకాశం ఉన్నాయి. మిగిలిన రెండు ప్రాంతాలూ టూరిజం శాఖకు సంబంధించినవే.

పిక్నిక్ సీజన్ నాటికి అందుబాటులోకి..



వివిధ దేశాల్లో విజయవంతంగా నడుస్తున్న కారవాన్ టూరిజం.. మన దేశంలో కేరళలో సక్సెస్ అయ్యింది. తొలి విడతగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రాంతాలను గుర్తించాం. ఆ ప్రాంతాల్లో అనుమతులు రాగానే ముందుకు వెళ్తాం. ఒక్కో ప్రాంతంలో అర ఎకరం విస్తీర్ణంలో కారవాన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. అక్కడ మంచినీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, సెక్యూరిటీ, ప్రధాన రహదారికి అనుసంధానం చేసే మార్గాలు.. ఇలా పర్యాటకులకు కావాల్సిన కనీస సదుపాయాలు ఏర్పాటు చేస్తాం. ప్రకృతిని ఆస్వాదించేందుకు కారవాన్లలో టెంట్లు కూడా అందిస్తాం. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుకు కానున్న వీటికి వాహనాన్ని బట్టి ప్యాకేజీలు నిర్ణయించాలని భావిస్తున్నాం. ఈ పిక్నిక్ సీజన్ నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– శ్రీనివాస్ పాణి,
పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్

జెడ్పీ సర్వ సభ్య సమావేశం 22కు వాయిదా

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 22వ తేదీకి వాయిదా పడింది. ముందు అనుకున్న ప్రకారం ఈనెల 19న సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించామని, ఖాళీగా ఉన్న పంచాయతీ స్థానాలకు ఎన్నికల దృష్ట్యా ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈవో పి.శ్రీరామ్మూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆ రోజు 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

యువజనోత్సవాలు నేడు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్‌లో నిర్వహించనున్నట్లు సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న ఉదయం పోటీలు ప్రారంభమవుతాయన్నారు. జానపద నృత్యాలు, జానపద గీతాలు, స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ అంశాలపై పోటీలు నిర్వహించనున్నామన్నారు.

20న విద్యా అవగాహన సదస్సు

ఆరిలోవ: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న విద్యా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చొక్కాకుల సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌టీఎఫ్ ఉపాధ్యాయులు, కేజీబీవీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, ఎంటీఎస్ 1998, 2008 ఉపాధ్యాయులు, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సదస్సులో పాల్గొని సమస్యలు తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్ డే

మహారాణిపేట: ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈ నెల 18న ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ఫిర్యాదులను జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో ప్రత్యేక ఐడీలతో నమోదు చేస్తామన్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఉద్యోగులు ఆయా జిల్లాల్లోనే ఫిర్యాదులు ఇవ్వాలని, ఇక్కడ స్వీకరించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

గంగవరం గరం.. గరం

- పోర్టు బంద్ ఉద్రిక్తత
- కుటుంబాలతో దూసుకొచ్చిన కార్మికులు
- పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వాదం
- ఐదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ



ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ : గంగవరం పోర్టు కార్మికులు కదంతొక్కారు. కుటుంబాలతో సహా ఆందోళనకు దిగారు. పోలీసులను తోసుకుంటూ.. ఇనుప కంచెను తెంచుకుంటూ పోర్టులోకి ప్రవేశించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అదానీ గంగవరం పోర్టు నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గంగవరం పోర్టు బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో గురువారం ఉదయం డీసీపీలు ఆనందరెడ్డి, విద్యాసాగర్ నేతృత్వంలో ఏసీపీ త్రినాథ్ పోలీసులను మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోర్టు గేటు ముందు పెద్ద ఎత్తున ఇనుప కంచె ఏర్పాటు చేశారు. భారీగా రోప్‌లను సిద్ధం చేశారు.

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తరఫున ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సంఘటన స్థలానికి చేరుకొని యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. ఏడాదికి రూ.10 వేలు పెంచడానికి యాజమాన్యం అంగీకరించిందని, అది కూడా వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఇస్తామన్నారని చెప్పారు. ఇప్పటివరకు విధులకు హాజరుకాని కార్మికులకు వేతనాలు ఇవ్వరని, విధుల నుంచి తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకుంటామన్నారని తెలిపారు. ఆర్డీవో చెప్పిన దానికి కార్మికులు ససేమిరా అన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకూ పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు చేపట్టిన ఆందోళనకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు గంగారాం, దల్లి గోవింద్, కార్మిక సంఘ నాయకులు మంత్రి రాజశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, గొందేశి రాము, వంశీకృష్ణ యాదవ్ తదితరులు మద్దతు తెలిపారు.

మొండిగా వ్యవహరించడం సరికాదు

ఈ సందర్భంగా జీపీఎస్ ఉద్యోగులు మాట్లాడుతూ గత 45 రోజులుగా పోరాటాలు చేస్తున్నా యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరిదన్నారు. 2024 సాధారణ ఇంక్రిమెంట్‌తో పాటు రూ.10 వేలు అదనంగా ఇవ్వాలని, ప్రస్తుతం జీతాలు ఎంత పెంచుతారో చెప్పాలన్నారు. ఎటువంటి షరతులు లేకుండా విధుల నుంచి తొలగించిన ఐదుగురు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. విధులకు హాజరు కాని అన్ని రోజులకు జీతాలు ఇవ్వాలన్నారు. కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్ 10 శాతానికి తగ్గకుండా బేషరతుగా ఇవ్వాలన్నారు. పై డిమాండ్లను తీర్చకపోతే కార్మికులందరికీ వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లను ఐదు రోజుల్లోగా పరిష్కరిస్తామని యాజమాన్యం చెప్పినట్లు ఆర్డీవో తెలిపారు.

మార్గదర్శిలో సీఐడీ సోదాలు



సీతంపేటలోని మార్గదర్శి కార్యాలయంలో సోదాలు చేస్తున్న సీఐడీ అధికారులు

దొండపర్తి / మధురవాడ / సీతంపేట : ఉమ్మడి విశాఖలో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. వీరితోపాటు రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, విజిలెన్స్ అధికారులు కూడా ఈ సోదాల్లో పాల్గొన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రికార్డులు, చిట్‌దారుల వివరాలు, బ్యాలెన్స్ షీట్లు, పన్నుల చెల్లింపులు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించారు. డిపాజిటర్ల సొమ్ము మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్ల సేకరణ వంటి విషయాలపై కార్యాలయాల ఉద్యోగులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే నగరంలోని ఒక బ్రాంచిలో ఈనాడు విలేకరి మార్గదర్శి ట్రైనీ ఉద్యోగి పేరుతో కార్యాలయంలోకి వెళ్లి తిష్టవేశాడు. సీఐడీ అధికారులు చేస్తున్న తనిఖీలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తమ వారికి చేరవేశాడు. సీతంపేట మెయిన్ రోడ్‌లో, ఎన్‌ఏడీ కూడలిలోని బ్రాంచిలలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు.

- పీఎం పాలెం మెయిన్ రోడ్డులోని విజేత సూపర్ మార్కెట్ పక్కన ఉన్న మార్గదర్శి మధురవాడ బ్రాంచిలో డీఎస్పీ నాగేశ్వరి ఆధ్వర్యంలో సోదాలు చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

కొమ్మాది: నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. అభ్యర్థులు https://navodaya.gov.in/nvs/en/Home1 ను సందర్శించి.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు పుట్టిన తేదీ, కేటగిరీ, మీడియం, అంగవైకల్యం తదితర సవరణలు చేసుకునేందుకు దరఖాస్తు తర్వాత మరో రెండు రోజుల పాటు గడువు ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

త్వరలో రాజన్న ఆటోనగర్‌కు భూమిపూజ



సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు, పాల్గొన్న అభిమానులు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- 157.77 ఎకరాల కోసం రూ.32 కోట్ల విడుదల
- ఘనంగా రాజన్న ఆటోనగర్ సక్సెస్ ఫుల్ కార్యక్రమం
- సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

జగదాంబ: ఆనందపురం మండలం కణమాం పంచాయతీలో రాజన్న ఆటోనగర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో భూమి పూజ చేస్తారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం జీవీఎంసీ 35వ వార్డు జనతాబజార్ వద్ద 'రాజన్న ఆటోనగర్ సక్సెస్ ఫుల్' కార్యక్రమం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. వర్క్‌షాపులన్నీ ఆటోనగర్ వలే పురోభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో సీఎం జగన్ ఆనందపురం దరి కణమాం వద్ద కేటాయించిన 157.77 ఎకరాల కోసం రూ.32 కోట్లు విడుదల చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసేది అయితే.. వైఎస్సార్‌సీపీ ప్రజల ప్రభుత్వమని, చెప్పిందే చేస్తామని సుబ్బారెడ్డి అన్నారు. రాజన్న ఆటోనగర్‌కు కావల్సిన మిగతా పనుల విషయం సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే భూములు ఇచ్చిన రైతులకు కూడా మెరుగైన పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాజన్న ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేసిన పటాన్ ఖాజావలీ సేవలు మరువలేనివని ఈ సందర్భంగా సుబ్బారెడ్డి కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరగాలంటే అందరం ప్రభుత్వానికి అండగా నిలబడి 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వై నాట్ 175.. వాసుపల్లి

ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటోనగర్ ఏర్పాటుకు కేవలం జీవో ఇచ్చి చేతులు దులుపేసుకుందని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం మాత్రం రూ.32 కోట్లు విడుదల చేసి. 157.77 ఎకరాలను 1130 మంది పేదలకు కేటాయించిదని చెప్పారు. ఈ ఆటోనగర్ ద్వారా 2500 కుటుంబాల్లో జగనన్న వెలుగులు నింపారన్నారు. గత ఎన్నికల్లో టైమ్స్ నౌ సర్వే చేసినప్పుడు ఏం జరిగిందో అందరికి తెలుసన్నారు. అప్పుడు 175కి 151 సీట్లు వస్తే.. ఇప్పుడు అదే టైమ్స్ నౌ ఈసారి సర్వే చేసి నివేదిక ఇచ్చిందని, అందులో వై నాట్ 175 అని ఉందని, అందులో దక్షిణ నియోజకవర్గం ఉంటుందని వాసుపల్లి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం తాడేపల్లి వైఎస్సార్ సీపీ లీగల్ అడ్వకేట్ వరప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బడుగు వికాసం అనే కార్యక్రమం చేపట్టారన్నారు. పేదలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. అనంతరం రాజన్న ఆటోనగర్ కోసం కృషి చేసిన పటాన్ ఖాజావలీని పూలమాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ జాన్‌వెస్లీ, ఎస్‌కేఎంఎల్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, బిపిన్‌కుమార్ జైన్, పార్టీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఆళ్ల గణేష్, బీసీ సెల్ డైరెక్టర్ మన్యాల శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోనిదేవా, మూజిబ్‌ఖాన్, సమీరాబేగం, బాబు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

నేటి నుంచి ఏపీపీఎస్సీ, రేపటి నుంచి యూపీఎస్సీ పరీక్షలు



సమీక్షిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ ద్వారా నగరంలో నిర్వహిస్తున్న పలు పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పలు పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ఈ నెల 18, 19, 21, 22 తేదీల్లో ఏపీపీఎస్సీ పోటీ పరీక్షలు, 19, 20 తేదీల్లో యూపీఎస్సీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఏపీపీఎస్సీ నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షకు 5,115 మంది, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ అధికారి పరీక్షకు 530 మంది, శాంపిల్ టేకర్ పరీక్షకు 166 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకు నగరంలో నాలుగు కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

19, 20న కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్ష

కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్ష ఈ నెల 19, 20వ తేదీల్లో యూపీఎస్సీ నిర్వహిస్తోందని.. ఈ పరీక్షకు జిల్లాలో 1,632 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతుందని.. నగరంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.వెంకటరావు, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఏఎస్‌వో పద్మ ప్రియ, యూపీఎస్సీ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఏవీఎన్‌లో అల్లూరి మనవడు సందడి



రామరాజును సత్కరించిన ఏవీఎన్ యాజమాన్యం

డాబాగార్డెన్స్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సోదరుడి మనవడు అల్లూరి శ్రీరామరాజు ఏవీఎన్ కళాశాలలో సందడి చేశాడు. విద్యార్థులు, సిబ్బంది ఆయన్ని చూసి సంబరపడ్డారు. తన తాత చదువుకున్న ఏవీఎన్ స్కూల్‌ను సందర్శించడం గర్వంగా ఉందని రామరాజు చెప్పారు. ముందుగా కళాశాల ఆవరణలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడిని కళాశాల యాజమాన్యం సత్కరించింది.

ఘనంగా అశోక్ లేలాండ్ ప్లాటినం జూబ్లీ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న అశోక్ లేలాండ్ అధికారులు

మురళీనగర్: అశోక్ లేలాండ్ ప్లాటినం జూబ్లీ వేడుకలను బిర్లా కూడలిలోని లక్ష్మీ మోటార్స్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ సీఈవో శ్రీనివాస రావు మాట్లాడుతూ అశోక్ లేలాండ్ 75 సంవత్సరాలుగా కస్టమర్లకు విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు. ఉత్సవాల సందర్భంగా ఈ ఒక్క రోజే 15 మంది వినియోగదారులు వాహనాలను బుక్ చేసుకున్నారని చెప్పారు. వీరందరికీ 50 గ్రాముల వెండి బహుమతిగా అందజేశామని తెలిపారు. జీఎం కృష్ణ అశోక్ లేలాండ్ వాహన విశిష్టతలు తెలిపారు. 15 మంది ఖాతాదారులను అశోక్ లేలాండ్ లక్ష్మీ మోటార్స్ నిర్వాహకులు ఘనంగా సత్కరించి ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందించారు. కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో అశోక్ లేలాండ్ కంపెనీ ఆర్ఎం కిరణ్, ఎఎస్ఎం నజీర్, ఏసీఎస్ఎం ప్రవీణ్, సేల్స్ డీఎస్ఎం పాల్గొన్నారు.

ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా చర్యలు

మహారాణిపేట: జిల్లాలోని ప్రాధాన్యత భవనాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ మల్లికార్జున సీఎస్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.

చేతులెత్తేసిన వైజాగ్ వారియర్స్

- తొలి మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్, రెండో మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ విజయం


షాట్ ఆడుతున్న గోదావరి టైటాన్స్ బ్యాటర్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ సీజన్–2 రెండో మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ 56 పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్‌పై విజయం సాధించింది. టైటాన్ కెప్టెన్ జ్ఞానేశ్వర్ అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన వారియర్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో టైటాన్స్ బ్యాటింగ్‌కు దిగింది. 20 ఓవర్లు బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లు కోల్పోయి 191 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఓపెనర్‌గా జ్ఞానేశ్వర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 53 బంతుల్లో 80 పరుగులు(3x4, 6x6) చేసి కార్తీక్ బౌలింగ్‌లో కరణ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. సందీప్ 38 బంతుల్లో 63 పరుగుల(5x4, 3x6) వద్ద రనౌట్ అయ్యాడు. హేమంత్ 20, శశికాంత్ 17 పరుగులు చేశారు. పవర్ ప్లే ఓవర్‌లో ఒక వికెట్ కోల్పోయి ఒక పరుగే చేసిన టైటాన్స్ మూడో వికెట్‌కు ఏకంగా జ్ఞానేశ్వర్–సందీప్ 100 పరుగులు జోడించారు. కార్తీక్ రామన్ రెండు వికెట్లు తీయగా ఆంజనేయులు, రాజు చెరో వికెట్ పడకొట్టారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వైజాగ్ వారియర్స్ 50 పరుగుల మార్క్‌ను మూడు వికెట్లు కోల్పోయి 32వ బంతికే నమోదు చేసింది. అయితే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో వారియర్స్ 17.4 ఓవర్లలోనే ఆలౌటైంది. ఓపెనర్‌గా కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ అత్యధికంగా 36 పరుగులు చేయగా.. కె.ఎస్.ఎన్ రాజు (35), కరణ్ షిండే(33) నాలుగో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. 115 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోగా మరో 20 పరుగులకే చివర్లో ఆరు వికెట్లు కోల్పోయి వారియర్స్ చేతులెత్తేశారు. ఇస్మాయిల్ మూడు వికెట్లు, విజయ్, శశికాంత్ రెండేసి వికెట్లు తీశారు. మాధవ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే 17 పరుగులు సమర్పించుకున్నా.. మూడో బంతికే ఓపెనర్ వికెట్ తీశాడు. చివర్లో సత్యనారాయణరాజు వికెట్ తీయడంతో వారియర్స్ ఆట ముగిసింది.

కుమ్మేసిన రాయలసీమ కింగ్స్

మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్‌పై రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కింగ్స్ కెప్టెన్ హనుమ విహారి టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడంతో ఉత్తరాంధ్ర లయన్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు గుల్ఫాం 1, కెప్టెన్ భరత్ 15 పరుగులు చేసి వెనుదిరిగారు. వన్‌డౌన్‌లో వచ్చిన రోహిత్(25) ఇన్నింగ్స్ చక్కదిద్దే పనిలో పడ్డాడు. మరో ఎండ్‌లో రాహుల్ 31 బంతుల్లోనే 60 పరుగులు(4x4, 5x6) చేశాడు. నాలుగో వికెట్‌కు శ్యామ్(22)తో కలిసి 53 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. వాసు 20 పరుగులు చేయగా తేజస్వి 13 పరుగులతో నిలవడంతో లయన్స్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. హరిశంకర్ నాలుగు ఓవర్లలో 24 పరుగులిచ్చి ముగ్గురిని ఔట్ చేశాడు. వినయ్ 2 వికెట్లు, సాకేత్, హనుమ, కమరుద్దీన్ చెరో వికెట్ పడగొట్టారు. భారీ లక్ష్యంతోనే బరిలోకి దిగిన రాయలసీమ కింగ్స్ ఓపెనర్లు అభిషేక్(16), వీరారెడ్డి(1) వికెట్లను 17 పరుగులకే కోల్పోయింది. హనుమ విహారి(13) మూడో వికెట్‌కు వంశీకృష్ణ(53)తో కలిసి 50 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి 69 పరుగుల వద్ద వెనుదిరిగాడు. 13 బంతుల్లోనే వినయ్ 21 పరుగులు చేసి 107 స్కోర్ వద్ద ఔటయ్యాడు. గిరినాథ్ 19 బంతుల్లో 32(3x4, 2x6), కమరుద్దీన్ 18 బంతుల్లో 39(5x4, 2x6) పరుగులతో నిలిచి మరో మూడు బంతులుండగానే జట్టును విజయతీరానికి చేర్చారు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ వేసిన అజయ్ తొలి బంతిని కమరుద్దీన్ బౌండరీకి తరలించగా తర్వాత రెండు బంతులను సిక్సర్లుగా మలిచి విజయకేతనం ఎగురవేశాడు. అజయ్, అయ్యప్ప, పృథ్వీ, తపస్వి, తేజస్వి చెరో వికెట్ తీశారు.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం


హోమీబాబా ఆస్పత్రిలో సేవలు ప్రారంభిస్తున్న డైరెక్టర్ బద్వే, సీఎండీ భట్

ఉక్కునగరం : క్యాన్సర్ రోగులకు హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. ఆస్పత్రిలో విస్తరించిన ప్రైవేట్ డే కేర్ సేవలు, ప్రైవేట్ వార్డులు, ఐసోటోప్ థెరపీ వార్డులు, సెయింట్ జూడ్స్ పీడియాట్రిక్ సపోర్ట్ యూనిట్, కెఫెటేరియా బ్లాక్‌లను ముంబయి టాటా మెమోరియల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎ.బద్వేతో సంయుక్తంగా ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోగుల కోసం కొత్త సౌకర్యాలు కల్పించడం వారి నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. డైరెక్టర్ బద్వే మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు ఏకరీతి మార్గదర్శక ఆధారిత సమగ్ర సేవలు అందించడానికి, దేశ వ్యాప్తంగా కేంద్రాలను అభివృద్ధి చేయడానికి టాటా మెమోరియల్ సెంటర్ విజన్‌తో పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ హోమీబాబా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతొట్టి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం గుండెల్లో వైఎస్సార్‌కు సుస్థిర స్థానం

- వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, ప్రధాన కార్యదర్శి ఫరూఖీ

ఏయూ క్యాంపస్: ప్రతి ముస్లిం గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి సుస్థిర స్థానం ఉందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. గురువారం చినవాల్తేర్‌లోని మసీదులో పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కె.వి.బాబా ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాథ్' కార్యక్రమం బ్రోచర్‌ను ఖాదర్ బాషా, ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూకీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం మహానేత తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో 34,17,199 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.11,896 కోట్లు జమ చేసిందన్నారు. 1.29 లక్షల ముస్లిం కుటుంబాలకు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సొంతింటి కల సాకారం చేసిందన్నారు. హజ్ యాత్ర చేపట్టే ముస్లింలపై ఆర్థిక భారం పడకుండా రూ.14.51 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు, మౌజమ్‌ల గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచి ఆయా కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మైనార్టీ నాయకులు మక్బుల్, ముస్తఫా, రఫీ, సమీ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకునికి మూడేళ్ల వంతున జైలు శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితులు జి.రాజు, మరో యువకుడు పూర్ణామార్కెట్ దగ్గర జబ్బరి తోటలో ఉంటున్నారు. బాధితురాలు(14) రెల్లివీధిలో ఉంటున్నారు. ఆమె ఏడో తరగతి వరకు చదువుకొని ఇంట్లోనే ఉంటోంది 2021 జనవరి 25వ తేదీ మధ్యాహ్నం బాలిక జబ్బరి తోటలోని తన పిన్ని ఇంటికి ఆడుకోవడానికి వచ్చింది. రాత్రి 7.30 సమయంలో తిరిగి తమ ఇంటికి వెళుతూ ఉండగా జబ్బరి తోట జంక్షన్‌లో ఇద్దరూ యువకులు అడ్డగించారు. కత్తి చూపించి తమతో రావాలని చిన్నారిని భయపెట్టారు. వారి చేష్టలతో భయపడ్డా బాలిక తమ పిన్ని ఇంటికి వెనుదిరిగింది. నిందితులు కూడా ఆమెతోపాటు వెంటాడి బాధితురాలు పిన్ని ఇంటికి వెళ్లారు. అక్కడ బాలికను పలుచోట్ల తాకడంతోపాటు లైంగిక దాడికి ప్రయత్నించారు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వారిని గుర్తుపట్టారు. చిన్నారి కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నేరా ఉపయోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో యువకునికి మాత్రమే శిక్ష ఖరారు అయింది. దీంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

సికింద్రాబాద్ నుంచి విశాఖకు వన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ నుంచి విశాఖకు వన్‌వే స్పెషల్ రైలు శుక్రవారం నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. సికింద్రాబాద్–విశాఖపట్నం(07055)వన్ వే స్పెషల్ శుక్రవారం రాత్రి 9 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి శనివారం ఉదయం 9.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్‌లలో ఆగుతుంది.

చెన్నై – హౌరా రీషెడ్యూల్

ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో గురువారం రాత్రి 7.20 గంటలకు బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా రాత్రి 10.15 గంటలకు బయల్దేరింది.

రేషన్ కార్డుదారులకు వంటల పోటీలు నేడు

మహారాణిపేట: పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మద్రిపాలెం(జాతీయ రహదారికి ఎదురుగా ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్) ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద పీడీఎస్ బియ్యంతో వంట పోటీలు నిర్వహిస్తున్నారు. ఫోర్టిఫైడ్ రైస్‌తో శుక్రవారం నిర్వహిస్తున్న వంట పోటీలకు అందరూ హాజరు కావాలని డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. కార్డుదారులకు అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

హెచ్ఎస్ఎల్ సీఎండీ హేమంత్‌ఖత్రికి స్వాగతం

సింధియా : ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్న సుమారు రూ.19 వేల కోట్ల ఆర్డర్లు దక్కించుకుని ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న హిందుస్థాన్ షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రికి షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు సంస్థ గేటు వద్ద గురువారం ఘన స్వాగతం పలికారు. మేళతాళాలలతో ఎదురెళ్లి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంస్థ గేటు నుంచి చైర్మన్ కార్యాలయం వరకు మేళతాళాలతో భారీ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హేమంత్‌ఖత్రి మాట్లాడుతూ ఆర్డర్స్ రావడానికి తనతోపాటు షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు ఎంతో కృషి చేశారన్నారు. సకాలంలో ఈ పనులు పూర్తి చేస్తే భవిష్యత్‌లో మరిన్ని ఆర్డర్‌లు వస్తాయని, అందరూ షిప్‌యార్డ్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

'సాక్షి' ఫొటో జర్నలిస్టులకు అవార్డుల పంట



జాతీయస్థాయి అవార్డు గెలుచుకున్న మోహన్ తీసిన ఫొటో(ఇన్‌సెట్) లీలామోహన్



జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకున్న నవాజ్ తీసిన ఫొటో(ఇన్‌సెట్) ఎండీ నవాజ్

దొండపర్తి: 'సాక్షి' విశాఖ ఎడిషన్ ఫొటో జర్నలిస్టులు పాట్నూరు లీలా మోహన్, ఎండీ నవాజ్‌లకు జాతీయ, రాష్ట్ర స్థాయి ఫొటో కాంటెస్ట్‌లలో అవార్డుల పంట పండింది. 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్(ఐఐపీసీ) సహకారంతో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా(పీఏఐ) జాతీయ స్థాయిలో ఫొటో కాంటెస్ట్–2023ను నిర్వహించింది. ప్రపంచ వాతావరణ సంస్థ పిలుపు మేరకు 'అండర్ స్టాండింగ్ ది క్లౌడ్స్', '77వ స్వాతంత్ర్య దినోత్సవం' అనే రెండు థీమ్‌లతో పోటీలు జరిగాయి. ఈ రెండు థీమ్స్‌లోనూ పాట్నూరు లీలామోహన్ బెస్ట్ ఇమేజ్ ఆఫ్ ఇది ఇయర్ అవార్డుతో పాటు మెరిట్ సర్టిఫికెట్‌ను దక్కించుకున్నారు. అండర్ స్టాండింగ్ ది క్లౌడ్స్ థీమ్‌కు సంబంధించి ఎండీ నవాజ్ తీసిన బ్లూ క్లౌడ్స్ ఫొటోకు మెరిట్ సర్టిఫికెట్ లభించింది. విజయవాడలో శుక్రవారం జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను వీరు స్వీకరించనున్నారు. అలాగే రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా న్యూస్, జనరల్ కేటగిరీల్లో ఎండీ నవాజ్‌కు ద్వితీయ బహుమతి లభించగా.. మోహన్ కన్సోలేషన్ బహుమతిని సాధించారు. ఈ నెల 19న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే

- కనకమహాలక్ష్మి ఆలయంలో పూజలు ప్రారంభించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- తొలి పూజలో పాల్గొన్న 122 మంది ఉభయదాతలు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఈవో శిరీష

డాబాగార్డెన్స్: విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణమాసం పురస్కరించుకుని శ్రావణలక్ష్మి పూజలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు గణపతి పూజ, అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాలు నడుమ ఉదయం 8.45 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి. 122 మంది ఉభయదాతలు రెండు బ్యాచ్‌ల్లో పూజల్లో పాల్గొన్నారు. వీరికి దేవస్థానం ప్రసాదం అందజేసింది. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఈవో కె.శిరీష, ధర్మకర్తలు అనురాధ, సత్యరూపవాణి, ఎస్.సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ప్రత్యేక ఆహ్వానితులు ఏవీ రామకృష్ణారావు, జి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ–ఒడిశాకు ఆర్టీసీ సర్వీసులు



డాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్టీసీ ఈ నెల 19 నుంచి ఒడిశా రాష్ట్రానికి అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు ప్రారంభించనున్నట్లు విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి ఒడిశాలోని వివిధ ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- ఉదయం 6 గంటలు: కూర్మన్నపాలెం నుంచి శ్రీకాకుళం, పర్లాకిమిడి మీదుగా గుణపూర్
- ఉదయం 10 గంటలు: విశాఖపట్నం నుంచి విజయనగరం, సాలూరు మీదుగా జైపూర్
- ఉదయం 10 గంటలు: విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం, పాతపట్నం మీదుగా పర్లాకిమిడి
- మధ్యాహ్నం 1.30 గంటలు: సింహాచలం నుంచి రాజాం, పాలకొండ, కొత్తూరు, హడ్డుబంగి మీదుగా గుణపూర్
- మధ్యాహ్నం 3.30 గంటలు: విశాఖపట్నం నుంచి ఎస్.కోట, అరకు మీదుగా ఒనకఢిల్లీ
- సాయంత్రం 4 గంటలు: విశాఖపట్నం నుంచి విజయనగరం, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం మీదుగా గుణపూర్
- సాయంత్రం 5 గంటలు: విశాఖపట్నం నుంచి విజయనగరం, సాలూరు మీదుగా నవరంగపూర్